సాక్షి ఒడిశా

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 6,38,397
బంగారం: 4 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి: 111 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



విద్యార్థుల ఆకలి కేకలు

మల్కన్‌గిరి జిల్లా కలిమెల హాస్టల్‌లో పిల్లలు ఆకలి కేకలు పెడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. - 8లో



సీఎం ఏరియల్ సర్వే

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సీఎం పరిశీలించారు. ఏరియల్ సర్వే చేశారు. - 8లో

న్యూస్‌రీల్

బిసంకటక్‌లో జనసంపర్క యాత్ర



పాదయాత్రలో పాల్గొన్న మహిళలు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో బీజేడీ ఆధ్వర్యంలో జనసంపర్క యాత్ర ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుధీర్ దాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగన్నాథ సరక, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బిసంకటక్‌లో గల మా మార్కమా మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు వద్ద గల శుభాస్ చంద్రబోస్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాజీ మంత్రి సరక మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీజేడీ మళ్లీ అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు.

పులి కాదు అడవి పంది



విమానాశ్రయంలో తిరుగాడుతున్న అడవి పంది ఇదే

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం డంపింగు యార్డు పరిసరాల్లో రాత్రి పూట చిరుత పులి తిరుగుతున్నట్లు వదంతులు వచ్చాయి. ఈ దుమారంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. శనివారం రాత్రి అంతా గాలించి పాదముద్రలు పులివి కావని నిర్ధారించారు. నిఘా కెమెరాలతోనూ పరిశీలించాక ఓ అడవి పంది తిరుగుతున్నట్లు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో స్కూటీ

రాయగడ: బైక్, స్కూటీ, బొలేరొ ఒకేసారి ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో స్కూటీ డ్రైవర్ బిశ్వనాథ్ కంటు, బైకర్ బంకతిమక ఉన్నారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం రాత్రి బిశ్వనాథ్ కళ్యాణ సింగుపూర్ నుంచి స్వగ్రామమైన బొడొపడికు స్కూటీపై వెళ్తుండగా.. రామ్‌పూర్ మలుపు వద్ద వెనుక నుంచి బైకుపై వస్తున్న తిమక ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదుపుతప్పిన రెండు వాహనాలు అదేమార్గం నుంచి ఎదురుగా వస్తున్న బొలేరొను ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనాలపై ఉన్న వారు కిందపడటంతో బొలేరొ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రక్కు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న ట్రక్కు

భువనేశ్వర్: జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న ట్రక్కు దగ్ధమైంది. దేవ్‌గఢ్ జిల్లాలో ఆదివారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇనుప ఖనిజం రవాణా చేస్తున్న ట్రక్కు 49వ నంబరు జాతీయ రహదారిపై బారకోట్ ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొంది. సమయ స్ఫూర్తితో డ్రైవరు ట్రక్కు నుంచి బయటకు రావడంతో ప్రాణాలతో బయట పడగలిగాడు.

రక్షణ గోడను ఢీకొట్టిన వ్యాన్



దెబ్బతిన్న వంతెన రక్షణ గోడ

జయపురం: జయపురం సమితి పాత్రోపుట్ గ్రామం సమీపంలోని ఐరన్ వంతెన రక్షణ గోడను ఆదివారం సరుకుల రవాణ చేసే ట్రక్కు ఢీకొట్టింది. దీంతో రక్షణ గోడ కొంత భాగం కూలిపోయింది. విజయవాడ–రాంచీ 326వ జాతీయ కారిడార్ కొలాబ్ నదిపై వందేళ్ల క్రితం ఆగ్లేయులు నిర్మించిన ఐరన్ వంతెన రక్షణ గోడ దెబ్బతినటంతో పాత్రోపుట్ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందని..తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పరబ్ పండుగ.. ఆనందం నిండుగ

- కొరాపుట్‌లో ప్రారంభమైన పరబ్–2024 ఉత్సవం
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీ, గిరిజన మహిళలు
- సంప్రదాయ నృత్యాలతో అలరించిన బృందాలు
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- రెండు నెలల పాటు కొనసాగనున్న ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు



పరబ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అతిథులు, అధికారులు



పరబ్ ఉత్సవంలో కొరాపుట్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ, కలెక్టర్ వీ.కీర్తి వాసన్



గిరిజన నృత్యాలు చేస్తున్న మహిళలు



ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్



దుదారిలోని మా మౌలిమా దేవాలయం

కొరాపుట్: రాష్ట్రస్థాయిలో నిర్వహించే కొరాపుట్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవం పరబ్–2024 ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి దుదారి పంచాయతీలోని మౌలిమా అమ్మవారి దేవాలయం వద్ద ప్రారంభమైన ఈ ఉత్సవానికి స్థానిక పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పరబ్ జ్యోతిని అతిథులకు అందజేసిన అనంతరం భారీ ర్యాలీ ప్రారంభించారు. గిరిజన, కోయా, దురువా తదితర తెగల మహిళలు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యేలు కూడా కాసేపు నృత్యం చేస్తూ అలరించారు. అందరూ కలిసి దుదారి గ్రామంలోని పరబ్ వేదిక వద్దకు చేరుకుని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్ అందజేసిన ఉత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఎంపీ ఉల్క అతిథులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ఉత్సవాలు పంచాయతీల స్థాయిలో ప్రారంభమై సమితి, సబ్ డివిజన్, జిల్లా స్థాయిల్లో జరుగుతున్నాయి. డిసెంబర్ 14, 15, 16 తేదిలలో ముగింపు ఉత్సవాలు, 17,18 తేదీల్లో పల్లెశ్రీ ఉత్సవాలు నిర్వహించారు. కొరాపుట్‌లోని పరబ్ మైదానంలో జరిగే ఈ వేడుకలకు సుమారు 15 రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరై ఆయా ప్రాంతాల విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేలా ప్రదర్శనలు ఇస్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తారా ప్రసాద్ బాహినిపతి (జయపూర్), రఘురాం మచ్చో (కొరాపుట్), పవిత్ర శాంత (లక్ష్మీపూర్), సీఎల్‌పీ నాయకుడు, పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర ఖడం, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



పరబ్ జ్యోతి వద్ద జనం



ప్రముఖులతో ప్రమాణం చేయిస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



రాజకీయ ప్రత్యర్థులు, ఎమ్మెల్యేలు రామ్‌చంద్ర ఖడం, తారా ప్రసాద్ బాహినీపతి ఆలింగనం



పరబ్‌కి వచ్చిన గిరిజన కళాకారులు



భారీ పరబ్ ర్యాలీ

లోక్‌సభ స్పీకర్‌తో గవర్నర్, ముఖ్యమంత్రి భేటీ



రాజ్ భవన్‌లో స్పీకరుతో గవర్నరు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల భేటీ

భువనేశ్వర్: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాష్ట్ర పర్యటనకు విచ్చేశారు. నగరంలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆయనను స్వాగతించారు. రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా భేటీ అయ్యారు. లోక్ సభ స్పీకరు ఓం బిర్లాతో సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. సంక్షిప్త సంభాషణలో ప్రజా స్వామ్య విలువల పరిరక్షణతో రాజ్యాంగబద్ధమైన పాలన అందజేసి ప్రజలకు సహాయ సహకారాలతో ముందుకు సాగాలనే సందేశం లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



స్పీకరు ఓం బిర్లాని స్వాగతించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు



విద్యార్థులతో న్యాయనిర్ణేతలు, సంస్థ అధ్యక్షుడు గౌరీ ప్రసాద్

రాయగడ: స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో ఆదివారం 15 ఏళ్లలోపు విద్యార్థులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు ఝాన్సీలక్ష్మీ బాయ్, రాణీరుద్రమదేవి, కాళికా మాత, శుభాస్ చంద్రబోస్ వంటి వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అరుణా చౌదరి, వందన జోషి వ్యవహరించారు. ఈ సందర్భంగా స్పందన సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరీ ప్రసాద్ మాట్లాడుతూ స్పందన వార్షికోత్సవ ఉత్సావాల్లో విజేతలకు త్వరోలనే బహుమతులను అందజేస్తామన్నారు.

డోలీలో ప్రయాణం.. ముగ్గురు శిశువుల జననం



డోలీలో మోసుకుంటూ తీసుకువెళుతున్న దృశ్యం



జన్మించిన ముగ్గురు శిశువులు

రాయగడ: డోలీలో ప్రసవ వేదన అనుభవించి నరకం చూసిన గర్భిణి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి మురిసిపోయింది. ఈ ఘటన జిల్లాలోని మునిగుడ సమితి మునిఖాల్ పంచాయతీలోని జెన్నిగుడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన డొంగిరియా ఆదివాసీ తెగకు చెందిన పులమ సికక గర్భవతి కావడంతో శుక్రవారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే గ్రామానికి చేరేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఊరికి ఆరు కిలోమీటర్ల దూరంలో బండి నిలిచిపోయింది. పురిటి నొప్పులు తీవ్రం కావడంతో గ్రామానికి చెందిన కొందరు ఆమె డోలీలో మోసుకుంటూ అంబులెన్స్ వరకు తీసుకువెళ్లారు. తర్వాత ఆమె ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు.

• మెగా ట్రీ ప్లాంటింగ్



పోలీసు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి పోలీస్ కార్యాలయంలో ఆదివారం భువనేశ్వర్‌లోని సాహా ఛారిటబుల్ ట్రస్ట్‌కు అనుకూలంగా మల్కన్‌గిరిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 4వ సాయుధ దళాలు జిల్లా కేంద్రంలో పోలీసు కార్యాలయంతో పాటు సెంట్రల్ స్కూల్, ఉమెన్స్ కాలేజీ, సెకండరీ స్కూల్, మల్కన్‌గిరి కళాశాలలో మొత్తం 1000 మొక్కలు నాట్బారు. ముఖ్య అథిదిగా జిల్లా డిప్యూటీ కమాండెంట్ సరోజ్ కుమార్ జెన్నా, రెడ్‌క్రాస్ కన్వీనర్ సత్యప్రియా విశ్వల్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఇంటా పండ్ల మొక్కలు నాటేందుకు మామిడి, సపోటా చెట్లు ఇస్తామని ట్రస్ట్ చైర్మన్ తెలిపారు.

పర్వ్ సన్నాహక సమావేశంలో అసంతృప్తి గళం

జయపురం: కొరాపుట్ ఆదివాసీ మహోత్సవ పర్వ్‌ను సమితి స్థాయిలో ఘనంగా నిర్వహించాలని జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి అధికారులు నిర్ణయించారు. అయితే కొంత మంది తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆదివారం సమితి కార్యాలయంలో పర్వ్ నిర్వాహక సమావేశం జరిగింది. సమితి బీడీఓ కపిలేశ్వర తండి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభికులు నిరసన వ్యక్తం చేశారు. గత 28 ఏళ్లుగా కొరాపుట్ ఆదివాసీ మహోత్సవాలు జరుగుతున్నాయని, దాదాపు ప్రతి సమితిలోనూ ఏదో ఒకసారి పర్వ్ ప్రారంభోత్సవాలు నిర్వహించారని, ఈ ఏడాది సెమిలిగుడ సమితిలో పర్వ్ ప్రారంభోత్సవం జరుగుతున్నదని అయితే ఒక్క సారి కూడా కుంధ్ర సమితి నుంచి ఎందుకు ప్రారంభించలేదని కుంధ్ర సమితి మాజీ అధ్యక్షులు సురేంద్ర పొరజ, సమితి ప్రముఖులు చంధ్ర సాగరియ, అక్షయ పట్నాయిక్, సంజయ కుమార్ సాహుతో పాటు పలువురు బీడీఓను ప్రశ్నించారు. జిల్లా అధికారులు కుంధ్రా పట్ల చిన్న చూపు చూపుతున్నారని ఆరోపించారు. పర్వ్ ప్రారంభోత్సవానికి నిర్ణయం జరిగి పోయిందని, జిల్లా అధికారులు కుంధ్ర సమితిని ఆహ్వానించారని, మనం ఆహ్వానాన్ని బీడీఓ విజ్ఞప్తి చేశారు. అలాగనే సమితిలో పర్వ్ వేడుకలకు సహకరించాలని కోరారు. సమావేశంలో సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, ఉపాధ్యక్షులు తరుణీ సేన్ బిశాయ్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధాబినోద్ సామంతరాయ్, జిల్లా పరిషత్ సభ్యులు కనకలత పెంటియ, జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్, డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్, పలువురు సమితి స్థాయి ప్రభుత్వ అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గున్నారు.



పర్వ్ సన్నాహక సమావేశంలో బిడొ, చైర్మన్ తదితరులు

క్లుప్తంగా

బాణసంచా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు


సీజ్ చేసిన బాణసంచా

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ కె.సీతాపురం గ్రామంలో లైసెన్సు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై కాశీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి ఒక లక్ష రూపాయల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. కె.సీతాపురం ప్రాంతానికి చెందిన సురేష్‌దాస్, ఎస్.ఫాల్గుణరావుపై కేసు నమోదు చేసినట్టు కాశీనగర్ పోలీసు అధికారి సునీల్ కుమార్ బెహేరా తెలియజేశారు.

గాయపడిన వృద్ధురాలు మృతి


శశిరేఖ సేనాపతి మృతదేహం

జయపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. శశిరేఖ సేనాపతి (79) ఈ నెల 20వ తేదీన గంగానగర్ జంక్షన్‌లో నిలుచొని ఉండగా.. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఒక కుటుంబం జయపురం గంగానగర్ లో తమ బంధువుల ఇంటికి వస్తుండగా ఆమెను కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శశిరేఖను స్థానికుల సహాయంతో కారు యజమాని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. అయితే మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందిన పోలీసులు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో శాన్వి సంచలనం



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన లట్టాల శాన్వి షటిల్ బ్యాడ్మింటన్‌లో సంచలనం సృష్టించింది. అస్సాం రాష్ట్రం డిబ్రుగర్‌లో జరుగుతున్న ఆలిండియా అండర్-13 సబ్ జూనియర్స్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024లో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. పాతపట్నంకు చెందిన ఈ చిన్నారి హైదరాబాద్‌లోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. తొమ్మిదేళ్ల పిన్న వయసులోనే అండర్-13 ఆలిండియా ర్యాంకింగ్ టోర్నీలో మెయిన్‌డ్రాకు అర్హత సాధించి రికార్డు నెలకొల్పిందని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్, హెడ్ కోచ్ వేణు ముప్పాల పేర్కొన్నారు. తండ్రి సాయిశ్రీరామ్ సినిమా ఫోటోగ్రాఫర్ కాగా తల్లి ఖుషి గృహిణి. బ్యాడ్మింటన్‌లో శాన్వికి మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా బాడ్మింటన్ అధ్యక్ష,కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ, ఇంటర్నేషనల్ అంపైర్ సంపతిరావు సూరిబాబు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఆకలికేకలు!


పిల్లలకు పెడుతున్న నాణ్యత లేని భోజనాన్ని పరిశీలిస్తున్న కలిమెల బీడీఓ ప్రదీప్ కుమార్ ఖార్


వసతి గృహంలో విద్యార్థుల గదులు పరిశీలిస్తున్న బీడీఓ


బీడీఓ పెట్టిన టిఫిన్ తింటున్న విద్యార్థులు

- అధికారులకు ఫిర్యాదు చేసిన వసతి గృహం విద్యార్థులు
- పిల్లలకు టిఫిన్ పెట్టించిన తరువాత సమస్యను విన్న బీడీవో

మల్కన్‌గిరి: విద్యార్థులు ఆకలి కేకలు పెట్టారు. తాము అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ కష్టాలను తీర్చాలని అధికారులను వేడుకున్నారు. దీనికి స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా అధికారులను కలిసేందుకు వచ్చిన పిల్లలకు ముందుగా టిఫిన్ పెట్టి.. వారు తిన్న తరువాత సమస్యలను విన్నారు. వివరాల్లోకి వెళితే.. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వసతి గృహంలో సుమారు వందమంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 30 మంది పదో తరగతి, మిగిలిన 70 మంది వేర్వేరు క్లాస్‌లు చదువుతున్నారు. అయితే ఇక్కడ మౌలిక వసతుల లేమితోపాటు పిల్లలకు సరైన భోజనం పెట్టడం లేదంటు విద్యార్థులు రోడ్కెక్కారు. మంది విద్యార్థులు ఆదివారం బీడీవో ప్రదీప్ కుమార్ ఖార్‌ను కలిశారు. తమకు హాస్టల్‌లో సరైన భోజనం పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో ముందుగా పిల్లలు ఆకలి తీర్చాలనే మంచి ఉద్దేశంతో వారికి టిఫిన్ పెట్టించారు. అనంతరం వారు చెప్పిన సమస్యలను విన్నారు. వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పిలలు తమ సమస్యలను చెప్పుకున్నారు. ఆరు నెలలుగా సరైన వసతి లేదని, భోజనం సక్రమంగా పెట్టడం లేదని, ఫ్యాన్లు పని చేయడం లేదని చెబితే మీవద్ద డబ్బులు ఉంటే ఇవ్వండి బాగుచేస్తామని సిబ్బంది అంటున్నారని బీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం షెడ్యూల్ తెగకు చెందిన విద్యార్థుల కోసం వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం బీడీవో ప్రదీప్ మాట్లాడుతూ.. సోమవారం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో శాంతించారు.

సారా విక్రయాలపై చర్యలు తీసుకోవాలి


పోలీస్ అధికారికి సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

జయపురం: బొయిపరిగుడ సమితి మహులి పంచాయతీ బపాణిగుడ గ్రామ పరిసరాల్లో విస్తారంగా నిర్వహిస్తున్న సారా బట్టీలను, విక్రయాలను వెంటనే అడ్డుకోవాలని ఆ గ్రామ మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం బొయిపరిగుడ పోలీసు అధికారిని కలిసి సమస్య వివరించారు. కొంత మంది సారా వ్యాపారులు బపాణిగుడ గ్రామ పరిసర అడవులలో చట్టవిరుద్ధంగా సారా బట్టీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వండిన సారాను గ్రామాలకు తీసుకువచ్చి అమ్ముతున్నారని వివరించారు. నాటు సారా తాగి గత సంవత్సరంలో తమ గ్రామంలో 9 మంది యువకులు మృత్యువాత పడినట్లు తెలిపారు. 20 ఏళ్ల వయసు లోపువారు సారా తాగి అస్వస్థతకు లోనవుతున్నారన్నారు. సారా తాగి మరణించిన వారి కుటుంబాలు, వితంతువులు సారా వల్ల ఏర్పడిన పరిస్థితిని పోలీసు అధికారికి వివరించారు. తమ గ్రామంలో సారా విక్రయంపై చర్యలు తీసుకోవాలని తాము చేస్తున్న అభ్యర్థనలను అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కొంత కాలంలో తమ గ్రామం పురుషులు లేనిదిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ మాట్లాడుతూ.. త్వరలోనే సారా వ్యాపారిని అరెస్టు చేస్తామని, అలాగనే బపాణిగుడ గ్రామంలో సారా అమ్మకాలను, బట్టీలను అడ్డుకుంటామని మహిళలకు హామీ ఇచ్చారు.

దానా మిగిల్చిన నష్టం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి


విపత్తు నష్టం సమీక్ష సమావేశంలో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లు

భువనేశ్వర్: దానా తుఫాన్ భారీ నష్టం మిగిల్చింది. ప్రజలకు నిలువ నీడ తొలగించింది. పంటల్ని నీట ముంచింది. విద్యుత్ స్తంభాల్ని కుప్ప కూల్చింది. పలు ప్రాంతాల్ని జలదిగ్బంధంలో మిగిల్చిందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. తుఫాన్ తాకిడితో రాష్ట్రంలో 14 జిల్లాలు ప్రభావితమైనట్లు తెలిపారు. 108 మండలాల్లో 1,671 గ్రామ పంచాయతీలు, 31 పట్టణ ప్రాంతాల్లో 426 వార్డులు దెబ్బ తిన్నాయి. సమగ్రంగా 35 లక్షల 95 వేల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ప్రాణ హాని నివారణ లక్ష్యంగా 8 లక్షల 10 వేల 896 మందిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆశ్రయం కల్పించినట్లు మంత్రి వివరించారు. దానా తీవ్రతతో రాష్ట్రంలో సమగ్రంగా 1 లక్ష 25 వేల 91 ఇళ్లు దెబ్బ తిన్నట్లు పేర్కొన్నారు. వీటిలో 5,840 ఇళ్లు విధ్వంసానికి గురి అయ్యాయి. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల నుంచి ప్రజల్ని తరలించడంతో ప్రాణ హాని ముప్పు తప్పిందన్నారు.

కరెంటుకోతతో అల్లాడిన ప్రజలు

పర్లాకిమిడి: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కరెంటు లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఒకటో నంబరు వార్డు గాసివీధిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో కరెంటు సరఫరా ఆగిపోయింది. రాత్రి ఎనిమిది గంటలైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు. దీంతో వినియోగదారులు విద్యుత్ శాఖపై మండిపడ్డారు.

రూ. 1.5 లక్షల బాణసంచా స్వాధీనం

పర్లాకిమిడి: ఆంధ్రా సరిహద్దు గుసాని సమితి అమర గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న రూ. 1.5 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారి ఐఐసీ ప్రశాంత భూపతి ఆదివారం తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

వాహనాల తనిఖీ


జరిమానా విధిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: స్థానిక పాత కోర్టు జంక్షన్ వద్ద ఆదర్శపోలీసు స్టేషన్ అధికారులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, మొబైలఫోన్ డ్రైవింగ్, ఇతర నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనచోదకులకు జరిమానా విధించారు. తనిఖీల్లో మోడల్ పోలీసుస్టేషన్ అధికారి తపన్‌కుమార్ పాఢి, సిబ్బంది పాల్గొన్నారు.

ఠాణాలో పోలీసుల ప్రవర్తనపై నిఘా


బాడీ కెమెరా ధారణతో మహిళా ఠాణా పోలీసు అధికారి


ఠాణా రిసెప్షన్ కేంద్రంలో బాడీ కెమెరాతో పోలీసు సిబ్బంది

భువనేశ్వర్: ఠాణాలకు విచ్చేసే సాధారణ ప్రజానీకం, విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది ప్రవర్తనపై గట్టి నిఘా ఏర్పాటైంది. ఠాణా ప్రధాన ప్రాంగణంలో సంప్రదింపుల వ్యవహారాల్లో విధులు నిర్వహించే సిబ్బంది బాడీ కెమెరాలు ధరించడం అనివార్యమైంది. కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనరు ఎస్.దేవదత్త సింగ్ ఈ మేరకు ఆదేశించారు. ఠాణాకు వచ్చిపోయే వారితో పోలీసు సిబ్బంది సత్ప్రవర్తన పట్ల పారదర్శక పర్యవేక్షణ కోసం ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. దీంతో ఉభయ వర్గాల పూచీదారీతనం నిర్ధారణ సులభతరం అవుతుంది.

ఉపాధ్యాయ సంఘం ఎన్నిక


సమితి ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులు

జయపురం: జయపురం సమితి ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. సంఘ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సహాయ కార్యదర్శుల పదవులకు ఎన్నికలు నిర్వహించారు. సమితిలో 860 మంది ఉపాధ్యాయ ఓటర్లలో 623 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో అధ్యక్ష పదవికి ముగ్గురు తలపడగా దేవీ ప్రసాద్ మిశ్ర 318 ఓట్లు పొంది విజయం సాధించారు. సాధారణ కార్యదర్శి పదవికి ముఖాముఖి పోటీ జరగ్గా ప్రదీప్ కుమార్ మిశ్ర తన ప్రత్యర్థిపై 47 ఓట్ల ఆధిక్యత సాధించారు. ఉపాధ్యక్ష పదవికి ద్విముఖ పోటీ జరగ్గా.. సదానంద సామంతరాయ్ తన ప్రత్యర్థిపై 198 ఓట్లతో గెలిపొందారు. సహాయ కార్యదర్శులుగా మమతా మహాపాత్రో, మనోరంజన్ పొలాయ్, సాగర్ త్రిపాఠీ, దీపక్ కుమార్ దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ప్రస్తుత అధ్యక్షులు లక్ష్మీకాంత పాఢీ, కార్యదర్శి పి.హరిశ్చంద్ర రావు వ్యవహరించారు. కొరాపుట్ జిల్లా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్, కార్యదర్శి రాజేంద్ర సాహు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిత్తరంజన్ రథ్, మనోజ్ పట్నాయిక్, స్వాధీన సాహు, మాధురీ పండా, పద్మచరణ చౌదరి తదితరులు ఎన్నికల నిర్వహణకు సహకరించారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


గుప్తేశ్వర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్, జయపురం సబ్ కలెక్టర్, తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో గల దక్షిణ ఒడిశాలో సుప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ హెచ్చరించారు. గుప్తేశ్వర్ క్షేత్రాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలకు శాశ్వత వ్యవస్థ కల్పించాలని సూచించారు. గుప్తేశ్వర ప్రాంతంలో శాశ్వత మొబైల్ నెట్‌వర్క్ కల్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చించాలన్నారు. మరుగుదొడ్లు, వసతి గృహాలు, బస్సు స్టాండ్‌ల పనులు యుద్ధ ప్రాతిపదిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డి, బొయిపరిగుడ బీడీఓ భాస్కర చంద్ర సాహు, తహసీల్దార్ స్నిగ్ధ చౌదరి, బ్లాక్ సమాజిక సురక్షా అధికారి కార్తీక చంద్ర పాఢి, విద్యుత్, తాగునీరు తదితర విభాగాల అధికారులు, జిల్లా స్థాయి, బొయిపరిగుడ సమితి అధికారులు, గుప్తేశ్వర యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

• సీఎం ఏరియల్ సర్వే


ఆకాశ మార్గంలో ముఖ్యమంత్రి పర్యవేక్షణ


జల దిగ్బంధిత ప్రాంతాలు


విహంగ వీక్షణంలో దానా తుపాను తీరం తాకిన భిత్తర్‌కనికా జాతీయ ఉద్యానంలో హవేలిఖొట్టి ప్రకృతి శిబిరం తుపాను తదనంతర దృశ్యం

భువనేశ్వర్: దానా తుఫాన్ తదనంతర పరిస్థితిని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆకాశ మార్గంలో పలు ప్రాంతాల్లో పర్యవేక్షించారు. ప్రతికూల వాతావరణంతో వాయిదా పడిన ఈ కార్యక్రమం ఆదివారం పూర్తయ్యింది. ముఖ్యమంత్రితో రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా పాల్గొన్నారు. దానా తుఫాన్ ప్రభావితం చేసిన కోస్తా ప్రాంతాలు పారాదీప్, మహాకలపడా, రాజ్‌నగర్, రాజకనికా, చాంద్‌బాలి ఆకాశ మార్గంలో ముఖ్యమంత్రి సందర్శించారు.

3న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సమాజ్ సమావేశం


సభను ప్రారంభిస్తున్న బ్రహ్మచారి అనురాగ్ చైతన్య


హాజరైన సభ్యులు

పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో నవంబర్ 3న జరిగే రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సమాజ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బ్రహ్మచారి అనురాగ్ చైతన్య పిలుపునిచ్చారు. పర్లాకిమిడిలోని పెద్ద రాధాకాంత మఠంలో గజపతి జిల్లా బ్రాహ్మణ సమాజ్ సమావేశం బసంత పండా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాగ్ చైతన్య మాట్లాడుతూ జిల్లాలోని ఒడియా బ్రాహ్మణ సమాజ్‌లో సభ్యులందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. సమావేశానికి బిష్ణుపండా, పొంచానన పండా, మనోజ్ దాస్, రాజేంద్ర రోథో తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

- ఉచితం పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ
- దంతవరపుకోట, మునగవలస, పెదమాలపేటలో అక్రమ నిల్వలు
- 'స్థానిక అవసరాల' నిబంధనకు తూట్లు పొడుస్తూ విక్రయాలు
- అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే..


పెద్దపాలెం శివాలయం వద్ద నిల్వచేసిన ఇసుకపోగులు


మునగవలస క్వారీలోఇసుక నిల్వలు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

ఇసుక ఉచితమంటూ కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. సరుబుజ్జిలి మండలం వంశధార నదీతీర పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తరలించుకోవచ్చని ప్రభుత్వం చేసిన ప్రకటనను కొందరు టీడీపీ నేతలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛ సాగిస్తున్నారు. సచివాలయం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే పంచాయతీ పరిధి దాటి ఉచితం మాటున ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి పలు ప్రాంతాల్లో అక్రమ నిల్వలు చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీల ద్వారా భారీ లారీలకు ఇసుక లోడింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ నిల్వ కేంద్రాలివే..

సరుబుజ్జిలి మండలంలోని దంతవరపుకోట, రొట్టవలస సమీపంలోని మునగవలస స్టోన్ క్రషర్, పెద్దపాలెం శివాలయం, పెదమాలపేట గ్రామాల వద్ద వంశధార తీర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు చెందిన లారీల్లో లోడింగ్ చేసి రవాణా చేస్తున్నారు. ప్రతి లారీకి రూ.15 వేలు నుంచి రూ.18 వేలు వరకు వసూలు చేసి భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

పట్టపగలే లారీలకు ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా జేసీబీల ద్వారా ఇసుక లోడ్ చేసి రవాణా జరుగుతున్నప్పటికీ పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీల పరిధి దాటి ఇసుక రవాణా చేయరాదని తీర ప్రాంత ఇసుక ర్యాంపుల వద్ద ప్రభుత్వం కానిస్టేబుళ్లను కాపలాగా పెట్టినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అతివేగంతో వెళుతున్న ఇసుక వాహనాల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారినపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

టీడీపీ నేతలదే కీలకపాత్ర......

ట్రాక్టర్ల ద్వారా తీసుకొస్తున్న ఇసుకను నిల్వ చేసి, లారీలద్వారా ఇతర ప్రాంతాలకు తరలించడంలో కొంతమంది టీడీపీ నేతలు ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ముగనవలస సమీపంలోని ఓస్టోన్ క్రషర్, దంతవరపుకోట ప్రదేశాల నుంచి అధికంగా లారీలు అడ్డదారుల్లో తరలిపోతున్నట్లు తెలుస్తోంది.

కేసులు నమోదు చేస్తాం

ఇసుకను స్థానిక అవసరాల మేరకు మాత్రమే వినియోగించాలి. అనధికారంగా నిల్వచేసినా, లారీల ద్వారా తరలించినా పట్టుకొని కేసులు నమోదు చేస్తాం.

– ఎల్.మధుసూదన,సరుబుజ్జిలి తహసీల్దార్

పిల్లల ఆసక్తిని గమనిస్తుండాలి

- డీఆర్‌డీఏ అధికారి డాక్టర్ గుణనిధి నాయక్



ముఖ్యఅతిథులుగా హాజరైన డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, సత్యన్నారాయణ త్రిపాఠి


గ్రీన్ బెల్ట్ కోసం తలపడుతున్న పిల్లలు


బ్లాక్ బెల్ట్ పోటీలో చిన్నారులు

పర్లాకిమిడి: పిల్లల ఆసక్తిని తల్లిదండ్రులు గమనించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ అన్నారు. స్థానిక గుండిచా మందిరం ఆవరణలో గజపతి జిల్లా తైక్వాండ్ అకాడమీ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జూనియర్, సీనియర్ గ్రూపుల మధ్య వివిధ ర్యాంకుల కోసం బ్లాక్, గ్రీన్ బెల్టు పోటీలు జరిగాయి. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్ పాల్గొని మాట్లాడారు. పిల్లలకు క్రీడలపై ఆసక్తి కలిగే తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తైక్వాండోను కూడా ఇటీవల ఒలింపిక్స్ ఈవెంట్స్‌లో చేర్చారన్నారు. మన దేశంలో ప్రప్రథమంగా ఈ ఏడాది తైక్వాండో పోటీలలో పతకాలు సాధించారన్నారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నవరంగ్పూర్ జిల్లా తైక్వాండో అకాడమి అధ్యక్షులు సత్యన్నారాయణ త్రిపాఠి, గజపతి తైక్వాండో అకాడమి అధ్యక్షులు కార్తీక చంద్ర మహాపాత్రో, అమూల్య పాణిగ్రాహి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

● విజేతగా నిలిచిన విజయనగరం



రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కొత్తవలస : మండలంలోని విజయనగరం రోడ్డులో గల భారత్ డిఫెన్స్ అకాడమీలో 68వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 16 మంది చొప్పున క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహించారు. మొదటి స్థా నంలో విజయగనరం జట్టు నిలవగా రెండు మూడు స్థానాల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం జట్లు నిలిచాయి. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టును నిర్వాహకులు ఎంపిక చేసారు. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఉత్తమ ప్రతిభ కకనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై విజేతలకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలను అందజేసారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికై న క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలవాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంట్, జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి ఎస్.భీమాశంకర్, భారత్ డిఫెన్స్ అకాడమి డైరెక్టర్ కె.రాజు. మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

లక్కవరపుకోట : మండలంలోని భీమాళి గ్రామం సమీపంలో గల తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై ఎస్ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేసారు. ఎనిమిది మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఆరు కోడి పుంజులను, రూ. 27వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు.

హోరాహోరీగా కుస్తీ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో సీనియర్ విభాగంలో కుస్తీ ఎంపిక పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి రెజ్లింగ్ క్రీడాకారులు హాజరై తమ సత్తాను చూపించారు. పురుషుల ఫ్రీ స్టైల్ విభాగంలో పవన్‌కుమార్(57 కిలోలు), కరుణానిధి(61 కిలోలు), బంగారునాయుడు (65 కిలోలు), జగదీష్(70 కిలోలు), సునీల్‌కుమార్(74 కిలోలు) ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సునంద(55 కిలోలు), లావణ్య(59 కిలోలు), ప్రవల్లిక(62 కిలోలు), స్వాతి(65 కిలోలు) ఎంపికయ్యారు. గ్రీకో రోమన్ స్టైల్ విభాగంలో సునీల్‌కుమార్(55 కిలోలు), సత్యం(63 కిలోలు), నితినికుమార్(67 కిలోలు), ఉదయ్ కిరణ్(72 కిలోలు), జీఎస్ పట్నాయక్(77 కిలోలు), హర్ష(82 కిలోలు), సంజయ్ వర్మ(97 కిలోలు) ఎంపికయ్యారు. ఎంపికై న క్రీడాకారులు వచ్చే నెల 9, 10 తేదీల్లో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా రెజ్లింగ్ అసోషియేసన్ ప్రతినిధులు వెంకటరమణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తివ్వాకొండ పరిసరాల్లో గజరాజులు



జామిగూడ సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

భామిని: మండలంలోని తివ్వాకొండ పరిసర గిరిజన గ్రామాలకు మళ్లీ గజరాజుల బెడద మొదలైంది. మండలంలోని మాసగూడ, జామిగూడ పరిసరాల్లో ఏనుగులు ఆదివారం సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. ఈ ప్రాంతానికి ఏనుగులు మళ్లీ రావడంపై ఆదివాసీ గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గిరిజన గ్రామాల పరిధిలో ఏనుగుల గుంపు కొండ దిగి వచ్చాయని, అప్రమత్తంగా ఉండాలని బత్తిలి ఎస్ఐ డి.అనిల్‌కుమార్, అటవీ శాఖాధికారులు హెచ్చరించారు. రాత్రి పూట కొండల వైపు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ఏనుగుల పట్ల ఎటువంటి కవ్వింపు చర్యలకు దిగరాదని తెలిపారు.

● విద్యుత్ బల్బుల చోరీ
● గిరిజన బొమ్మలు ధ్వంసం
● మూలకు చేరిన విలువైన వస్తువులు

గిరిజన మ్యూజియంకు.. భద్రత కరువు



పాత పీఎంఆర్‌సీ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం

సీతంపేట: స్థానిక పాత పీఎంఆర్‌సీ సెంటర్‌లో నిర్మాణ దశలో ఉన్న గిరిజన మ్యూజియం సామగ్రికి భద్రత కరువైంది. ప్రస్తుతం ఎటువంటి పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. ఇదే అదనుగా కొంతమంది చోరులు ప్రత్యేక గదుల్లోకి ప్రవేశించి కొన్ని విద్యుత్ బల్బులను చోరీ చేసినట్లు తెలిసింది. సెంట్రలైజడ్ ఏసీ కోసం బయట బిగించే రెండు బాక్సులు సైతం కనిపించకపోవడం విశేషం. గిరిజనుడి బొమ్మ యొక్క చేతి వేళ్లను పగులగొట్టి దానికి కట్టిన పంచె సైతం తీసుకు పోవడం గమనార్హం. దీనిపై పోలీసులు శనివారం గిరిజన మ్యూజియం సెంటర్‌కు వెళ్లి ఆరా తీశారు. గదులన్నింటిని పరిశీలించారు. ఎక్కడ ఏఏ సామగ్రి పోయింది?, చోరులు గదుల్లోకి ఎలా ప్రవేశించారు? తదితర అంశాలను విచారిస్తున్నారు.

మూలన పడేసిన విలువైన సామగ్రి

పర్యాటకంగా సీతంపేట ఏజెన్సీని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కోటి రూపాయిల వ్యయంతో గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. ఇతర రాష్ట్రాలలో ఉన్న గిరిజన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో పాటు మన రాష్ట్రంలో గిరిజనులు జరుపుకునే పండగలు వంటివి ఎలా చేసుకుంటారనే దానిపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి బొమ్మలు రూపంలో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఇందుకు పాత పీఎంఆర్‌సీ భవనాల వద్ద గదులు కేటాయించారు. బయట షాపింగ్ కాంప్లెక్స్ వంటివి కూడా ఏడాది కిందట నిర్మించారు. గిరిజనుల ధరించే వస్తువులు, వాయించే తంబుర, తుడుములు, ఢంకాలు, మృదంగాలు వంటి విలువైన పరికరాలు కొనుగోలు చేసి ఒక గదిలో మూలన పడేశారు. దీంతో అవి పాడయ్యే స్థితికి చేరాయి. బుట్టలు, జల్లెడలు, చేటలు ఇతర సామగ్రి సైతం ఒక దగ్గర పెట్టేసి వదిలేశారు. వీటికీ రక్షణ లేకుండా పోయింది.

ఏపీఓ ఏమన్నారంటే...

ఈ విషయమై ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు వద్ద సాక్షి ప్రస్తావించగా గిరిజన మ్యూజియాన్ని విజిట్ చేసి ఏం జరిగిందనేది పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



చేతి వేలి విరగొట్టేసిన గిరిజనుడి బొమ్మ



లైట్లు తీసుకువెళ్లిన చోరులు



సెంట్రలైజడ్ ఏసీ బాక్సులు మాయమైన ప్రదేశం



మూలన పడేసిన విలువైన సామగ్రి

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి



చెకుముకి పోటీ పరీక్షల పుస్తకాలను విడుదల చేస్తున్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని మెరుగుపరిచే దిశగా జన విజ్ఞాన వేదిక పని చేయడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి సంబరాలు ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిభ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మెరుగుదల పట్ల ఆసక్తి వున్న ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, డాక్టర్లు, ఉద్యోగులు అనేక మంది ఇటువంటి సంస్థలో పని చేసి వారి సమయాన్ని వెచ్చించటం రాబోయే రోజుల్లో కాబోయే పౌరులైన ఈ నాటి విద్యార్థులకు ఒక వరమని అన్నారు. ఇటువంటి పరీక్షలు మంచి మార్పులకు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన సైన్స్ పరిశోధనల సెమినార్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్, పి.వేణుగోపాల్ విద్యార్థులకు పలు ప్రయోగాలు చేసి చూపించారు. రిటైర్డ్ హెచ్‌ఎం అచ్చిబాబు మ్యాజిక్ షో విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రజా కళాకారుడు డప్పు శ్రీను తన పాటలతో మంచి వినోదాన్ని పంచారు. జిల్లా స్థాయి పోటీల్లో వివిధ మండలాల నుంచి హాజరైన 34 జట్లలో డెంకాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల తమ ప్రతిభ ప్రదర్శించారు. పోటీల్లో విజయనగరంలోని ది నేషనల్ స్కూల్ విద్యార్థులు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ సన్యాసమ్మ, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎంవీఎస్ వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, రాష్ట్ర సమతా కన్వీనర్ జి.నిర్మల, జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

సంతకవిటి:

మండలంలోని బిళ్లాని గ్రామానికి చెందిన బోగి నాంచారయ్యపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. బోగి నాంచారయ్య తన భార్య భోగి లక్ష్మిపై అనుమానంతో ఆదివారం ఉదయం కొట్టడంతో రాజాంలోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇరువురిపై కేసు నమోదు

మండలంలోని హొంజరాం గ్రామంలో శనివారం పొలంలో నీటి విషయమై ఏర్పడిన గొడవతో అడపా జనార్దన, అడపా సత్యం ఇరువురు కొట్టుకున్నారు. గాయాల పాలైన వీరు రాజాంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. దీనితో ఆదివారం ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో ఇరువురుపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

అనంత లోకాలకు 'ఆశయ' సాధకుడు



కన్నీటి వీడ్కోలు పలుకుతున్న యువత



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్లో) రెడ్డి రమణ (ఫైల్)

● రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మృతి
● అంతిమ యాత్రకు వేలాదిగా తరలి వచ్చిన యువత
● విలపించిన భార్య, పిల్లలు
● సంతాపం తెలిపిన జెడ్పీ చైర్మన్, మాజీ ఎంపీ బెల్లాన, నాయకులు

చీపురుపల్లి: 'ప్రతి ఆదివారం మా గ్రామం వస్తాడు.. మంచి పుస్తకాలు తీసుకొస్తాడు అంటూ ఎదురు చూసే వారికి ఏమని చెప్పాలి'

'అత్యవసర సమయాల్లో రక్తం కావాలంటే వెంటనే రమణకు ఫోన్ చేయాలన్న ధైర్యం పోయింది'

'అనాథ శవాలకు దహన సంస్కరణలు చేయ దానికి ఎవరు ఉన్నారంటే ఏం చెప్పాలి?..

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ(42) ఆదివారం వేకువజామున 3 గంటలకు మృతి చెందడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు, స్టేటస్‌లు ఇవి. సుమారు 20 ఏళ్లుగా సామాజిక సేవలు అందిస్తూ.. అందరినోటా మా రమణ అని పేరొందిన వ్యక్తి మృతితో ఈ ప్రాంత ప్రజలు కన్నీటిపర్యంతమయ్యారు. కొద్ది రోజుల కిందట రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విధులు నిర్వహించేందుకు రమణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జి.సిగడాం మండల సరిహద్దులో లగేజీ వాహనం ఢీకొంది. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తనువుచాలించారు. రమణకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

కన్నీటి నివాళి

రమణ మృతివార్త తెలియడంతో చీపురుపల్లి, పరిసర గ్రామాల యువత కన్నీటి నివాళులర్పించారు. విజయనగరం నుంచి జి.అగ్రహారం వరకు ఆయన భౌతిక కాయం వెంట ర్యాలీగా సాగారు. జోహార్లు అర్పించారు.

అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమణను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినప్పుడే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి డబ్బుల కోసం చూడకుండా అత్యవసర వైద్యం అందించాలని సూచించారు. ప్రతిరోజూ వైద్యులతో మాట్లాడారు. రమణ మృతి చెందిన తరువాత కొంత డబ్బు ఆస్పత్రికి చెల్లించాల్సి ఉన్న పరిస్థితుల్లో ఆయన వైద్యులతో మాట్లాడి తక్షణమే మృతదేహాన్ని పంపించాలని, అవసరమైతే డబ్బులు చెల్లిస్తానని చెప్పడంతో ఆస్పత్రి వర్గాలు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహారాజ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం వేగవంతంగా పూర్తిచేయించారు. జి.అగ్రహారంలో స్మశానవాటిక వద్దకు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చేరుకుని రమణ మృతదేహానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎం.వరహాలనాయుడుతో పాటు కూటమి నాయకులు కామునాయుడు, శ్రీనివాసరావు మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. జీఎంఆర్ యాజమాన్య ప్రతినిధులు రమణ కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు.

నేత్రదానం చేసిన ఆశయ రమణ

మరణానంతరం నేత్రాలను దానం చేస్తానని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థకు రమణ అంగీకార పత్రం అందజేశాడు. ఆ మేరకు కుటుంబ సభ్యుల అంగీకారంతో సంస్థ డాక్టర్లు ఆస్పత్రికి వెళ్లి రమణ నేత్రాల నుంచి కార్నియాను సేకరించారు.

సేవలకు జాతీయ పురస్కారం

దాదాపు 20 ఏళ్ల కిందట రమణ ఆశయ యూత్ అసోసియేషన్ అనే సంస్థను స్థాపించారు. మొక్కలు నాటడం, పర్యావరణంపై చైతన్యవంతులను చేయడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యవసర సమయాల్లో రక్తదానం, పిల్లలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించేందుకు ఊరూరా మొబైల్ లైబ్రరీ నిర్వహణ, నిరాశ్రయులకు భోజనాలు పెట్టడం, అనాథలు మరణిస్తే దహన సంస్కారాలు పూర్తిచేయడం వంటి సామాజిక సేవలతో మంచి పేరుపొందారు.



జాతీయ స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న రమణ (ఫైల్)

ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2014లో జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని ఏపీ నుంచి రమణకు ప్రదానం చేసింది.

104, 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలసూరి



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన 108 ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు జి.అప్పలసూరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు బకాయి ఉన్న మూడు నెలల జీతం తక్షణమే చెల్లించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియామకాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, డీఈఓలకు వెయిటేజీ ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రామరాజు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఇచ్చిన డిమాండ్ నోటీస్‌పై యాజమాన్యం జరిపిన చర్చల్లో పలు ప్రధాన సమస్యలకు సానుకూల హామీ రాకపోవడంతో నవంబర్ 8 వరకు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోను వెంకటరమణ, ఎస్.సతీష్‌కుమార్, కళ్యాణ్, పండు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ సంబంధిత మధ్యంతర భృతి ప్రకటించాలి

● ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్యామ్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 12వ పే రివిజన్‌కు సంబంధించి మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ డిమాండ్ చేశారు. స్థానిక అమర్ భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీకి సంబంధించి గత ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుత పీఆర్‌సీ చైర్మన్ రాజీనామా చేయడం వల్ల ఎటువంటి పురోగతి జరగలేదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా ఇప్పటి వరకు నూతన చైర్మన్ నియామకం చేయలేదని, తక్షణమే నూతన చైర్మన్ నియామకం జరిపి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు కేంద్ర మెమో ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తక్షణమే పెండింగ్ డీఏలు ప్రకటించాలని, అమల్లో ఉన్న డీఏలకు సంబంధించి ఎరియర్స్, గత పీఆర్‌సీ ఎరియర్స్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ దొర, డి.శ్రీరామ్, బంగారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

పూసపాటిరేగ : మండల కేంద్రమైన పూసపాటిరేగలో మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... విజయనగరానికి చెందిన యువకుడు మద్యం మత్తులో మోటార్‌సైకిల్ నిర్లక్ష్యంగా నడిపి ఎరుకొండకు చెందిన కె.పూజిత, గుంపాంకు చెందిన రాయి బంగారయ్యను బలంగా మోటార్‌సైకిల్‌తో ఢీకొనడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామతీర్థంలో ప్రత్యేక హోమాలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో ఆదిత్య హృదయం, సుందర కాండ హవనం, తదితర హోమాలు జరిపించారు. అనంతరం లోక కల్యాణార్థం స్వామి వెండి మండపం వద్ద సీతా రాముల నిత్య కల్యాణం చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ విజయనగరం

● సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్-14, 17, 19 బాలురు, బాలికల సైక్లింగ్ టోర్నీలో విజయనగరం జిల్లా ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. మూడు విభాగాల్లో ఆ జిల్లా సైక్లిస్టులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 34 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు రెండో స్థానంలో, ఆతిథ్య ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు 21 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఏపీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ యూనిట్ పర్యవేక్షణలో రెండు రోజుల పాటు నున్న జెడ్పీ హైస్కూల్ 16వ నంబరు జాతీయ రహదారిపై సైక్లింగ్ పోటీలను నిర్వహించింది. మొత్తం 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది సైక్లిస్టులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్)నేషనల్స్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రెండు రోజుల పాటు జరిగిన సైక్లింగ్ టోర్నీ ముగింపు కార్యక్రమం జెడ్పీ హైస్కూల్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ గేమ్స్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. అంతకు ముందు వ్యక్తిగత అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి రిటైర్డ్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు (ఖాజీపేట) వేణుగోపాలరావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, గుంటక శివశేషిరెడ్డి మెడల్స్‌ను ప్రదానం చేశారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.సుగుణరావు, సైక్లింగ్ టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శులు టి.శ్రీలత, టి.విజయవర్మ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విజయనగరం జట్టు

హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేయాలి

● ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘు అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్

విజయనగరం రూరల్: పంచాయతీ ఉద్యోగులంతా తమ హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ మినీస్టీరియల్ సంఘ కార్యాలయంలో ఉత్తరాంధ్ర పంచాయతీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 116 ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే డీఎల్‌డీఓ 26 మంది.. జూనియర్ అసిస్టెంట్లు 23 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే యూనియన్ సమావేశానికి చాలామంది హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర జనరల్ కార్యదర్శి కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ సభ్యులు జె.సుబ్బారెడ్డి, ఆవు సురేష్, బి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ రాజు, సీహెచ్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

విజయనగరం: విజయనగరం విలేజ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు హోరా.. హోరీగా సాగాయి. నగరంలో ఓ ఇండోర్ స్టేడియంలో మెన్, 35 ప్లస్ వయస్సుల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 35 ప్లస్ విభాగంలో బొబ్బిలికి చెందిన జి.వాసు-పి.రమేష్‌ల జోడి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా.. విజయనగరానికి చెందిన పి.నవీన్‌కుమార్ - వి.అశోక్‌ల జోడి ద్వితీయ స్థానం, విజయనగరానికి చెందిన ఎం.శ్రీను-టి.గౌరీశంకర్‌ల జోడి తృతీయ స్థానంలో నిలిచాయి. అదే విధంగా మెన్స్ విభాగంలో విజయనగరానికి చెందిన పి.నవీన్‌కుమార్-శ్రీనుల జోడి ప్రథమ స్థానం, విశాఖపట్నంకు చెందిన జగదీశ్వర్-వంశీల జోడి ద్వితీయ స్థానం, తగరపువలసకు చెందిన శ్రీను-సాయిల జోడి తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు సిటీబ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వివిఎస్.ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్.కుటుంబరావుల చేతుల మీదుగా రూ.5000, రూ.3000, రూ.2000 చొప్పున నగదు బహుమతులను, ట్రోఫీలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో విలేజ్ స్పోర్ట్స్ ప్రతినిధి సంగమరెడ్డి భాను, గాయత్రి, వెంకటేష్, పి.ఆదిలక్ష్మి, ఎస్.యశోద తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

● ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: బాణ సంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి పేర్కొన్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని బాణసంచా విక్రయించే వ్యాపారులకు ఎస్పీ ఆదివారం పలు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులకు వ్యాపారులు సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించకున్నా, హెచ్చరికలు పెడచెవిన పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు పెట్టకూడదని, అక్రమంగా నిల్వ ఉంచినా, అనధికారికంగా విక్రయాలు జరిపినా సంబంధిత వ్యాపారులపై పేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు తీసుకోని దుకాణాలపై దాడులు జరిపేందుకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాశ్వత, తాత్కాలిక బాణ సంచా తయారీ, విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాల్లో మా త్రమే బాణసంచా విక్రయాలు జ రుపుకోవాలన్నారు. ప్రమాదాల ని వారణకు అవసరమైన నీరు, ఇసు క, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.